
కౌంటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి



హాజీపూర్, జూన్ 1: కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు విజయ ఈ రవికుమార్ ఎస్‌సీఎస్ అన్నారు. శనివారం ముల్కల్లలో ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, డీసీపీ అశోక్‌కుమార్, ఆర్డీవో రాములు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, ఏసీపీ ప్రకాష్‌తో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ పరిశీలకులు మాట్లాడుతూ చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు ఇబ్బం దులు తలెత్తకుండా ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రంలో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ, కౌంటర్లు, విద్యుత్, ఇంటర్నెట్, తాగునీటి సదుపాయాలు కల్పించాలన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: లోక్ సభ ఎన్నికలకు సంబంధించి 4న జరిగే ఓట్ల లెక్కింపు కార్య క్రమం కౌంటింగ్ పరిశీలకు లుగా నియమితులైన విజయ ఈ రవికుమార్ ఎస్ సీఎస్ జిల్లాకు చేరుకున్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సం తోష్, డీసీపీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్ రాహుల్‌లు పుష్పగుచ్ఛం అందించారు.



- రూ.కోట్ల విలువ చేసే భూముల నుంచి జాతీయ రహదారి
- ఆర్మూర్-మంచిర్యాల హైవే అలైన్‌మెంట్ మార్పుతో ఇబ్బందులు
- పాత రహదారితో సంబంధం లేకుండా కొత్త అలైన్‌మెంట్
- ఆందోళనలో రైతులు

సాగు భూముల్లోంచి ‘బ్రౌన్‌ఫీల్డ్’



ఎన్‌హెచ్ 63 నిర్మాణానికి పుట్టుకొచ్చిన వేర్వేరు అలైన్‌మెంట్లు

మంచిర్యాల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బ్రౌన్‌ఫీల్డ్ జాతీయ రహదారి సాగు భూముల్లోంచి వెళుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి జగిత్యాల-మంచిర్యాల మీదుగా వెళ్లే 63వ జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా చంద్రాపూర్-జగ్దల్‌పూర్ 363 ఎన్‌హెచ్‌ని అనుసంధానం చేయనున్నారు. మొత్తం 148.6 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారిని బ్రౌన్‌ఫీల్డ్‌గా మార్చేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

● దూరం తగ్గుతుండడంతో..

నిజామాబాద్ జిల్లా బాల్కొండకు సమీపంలోని ఎన్‌హెచ్-44కు అనుసంధానించేలా ప్రస్తుత బ్రౌన్‌ఫీల్డ్ అలైన్‌మెంట్ రూపొందించారు. పాత ఆర్మూరు రోడ్డు కన్నా 23 కిలోమీటర్లు దూరం తగ్గుతుంది. బాల్కొండ నుంచి రెంజర్ల, షెట్‌పల్లి గ్రామాల మధ్య నుంచి తొర్తి, ఎరగట్లు, వర్గొండ మీదుగా మెట్‌పల్లి ప్రాంతంలోని కొజాన్ కొత్తూరు, యమపురం, తిమ్మాపూర్, రాఘవపేట, చిట్టాపూర్, గుండంపల్లి గుండా జగిత్యాల సమీపంలోకి వెళ్తుంది. అక్కడి నుంచి హైదర్ పేట, గుట్టరాజుపల్లి, గంగాపురం, గోపాలపురం మీదుగా మంచిర్యాల జిల్లాలోకి ప్రవేశిస్తుంది. జిల్లాలో కన్నెపల్లి, గంపలపల్లి మీదుగా ఉత్కూరు, లింగాపూర్, ధర్మారం, బుగ్గగూడెం, ముల్కల్ల గుండా బొక్కలగుట్ట వద్ద ఎన్‌హెచ్ 363ని అనుసంధానం చేయనున్నారు.

● కేంద్ర మంత్రుల నిర్ణయంతో..

కేంద్ర మంత్రుల నిర్ణయంతో జాతీయ రహదారి నిర్మాణానికి మరో రూట్‌మ్యాప్ సిద్ధమైంది. మొదటి అలైన్‌మెంట్ ప్రకారం నివాస గృహా లకు ఎలాంటి నష్టం వాటిల్లక పోగా బడా వ్యక్తులకు చెందిన స్థిరాస్తులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉండేది. రెండో రూట్ మ్యాప్ ప్రకారం లక్సెట్టిపేట నుంచి ముల్కల్ల వరకు నివాస గృహాల మీదుగా రహదారి వెళ్తోంది. దీనివల్ల స్థిరాస్తి వ్యాపారులకు నష్టం వాటిల్లకపోగా, సామాన్య ప్రజలకు తీరని నష్టం కలిగేలా ఉంది. దీంతో సర్వేలను గ్రామస్థులు అడ్డుకోవడం, భూములు ఇచ్చేందుకు నిరాకరించడంతో మూడో అలైన్‌మెంట్ తెరపైకి వచ్చింది. కొత్త అలైన్‌మెంట్ ప్రకారం బ్రౌన్‌ఫీల్డ్ హైవే లక్సెట్టిపేట మండలంలోని గోదావరి నదిని తాకుతూ పంట పొలాలు, చేల మీదుగా నిర్మాణం జరగాల్సి ఉంది. గతంలో ఈ ప్రాంత రైతులకు చెందిన భూములు పెద్ద ఎత్తున శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కోసం సేకరించారు. ప్రస్తుతం రహదారి కోసం నోటిఫికేషన్ జారీ చేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

గతంలో ప్రాజెక్టు కోసం విలువైన స్థలాలను త్యాగం చేయగా, మిగిలిన కొద్దోగొప్పో భూముల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బ్రౌన్‌ఫీల్డ్ రహదారి కారణంగా ప్రస్తుతం వాటిని కూడా ప్రభుత్వం సేకరించేందుకు సిద్ధపడ్డారు. దీంతో రైతులు ఆందోళన బాట పట్టేందుకు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. బడాబాబులను కాపాడేందుకు మొదటి అలైన్‌మెంట్ రద్దు చేయగా, మూడో అలైన్‌మెంట్ ప్రకారం సామాన్య రైతులకు ఎసరుపెట్టే యత్నం జరుగుతోంది. ఇప్పటికైనా ఎన్‌హెచ్ అధికారులు మొదటి అలైన్‌మెంట్‌ను అమలు చేయడం ద్వారా సాగు భూములను వదిలివేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

● స్థిరాస్తులు కోల్పోతుండడంతో..

బాల్కొండ నుంచి లక్సెట్టిపేట వరకు ఎక్కడా పట్టణంలోకి జాతీయ రహదారి వెళ్లకుండా అలైన్‌మెంట్ రూపొందించారు. పట్టణాలకు సమీపంలోని పల్లెల శివారు నుంచి అలైన్‌మెంట్ ఉంది. రహదారి వెళ్లే మార్గంలో విలువైన రియల్ ఎస్టేట్ వెంచర్లు, స్కూళ్లు, పక్కా భవనాలు, ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 113.191 కిలోమీటర్ల భూము లు హైవే కింద సేకరిస్తుండగా ఎకరాకు కనీసం రూ.కోటి ధర పలు కుతోంది. దీంతో పట్టాదారులు ఆందోళనబాట పడుతున్నారు. కేవలం మంచిర్యాల ప్రాంతంలోనే సుమారు వందల కోట్లు విలువ చేసే స్థిరా స్తులు కోల్పోతుండటంతో రాజకీయ పలుకుబడి కలిగిన కొందరు మూడేళ్ల క్రితం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలిసి అలైన్ మెంట్ రద్దు కోసం కృషిచేసి సఫలీకృతులయ్యారు.

8న ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

ఏసీసీ, జూన్ 1: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, డీఎస్పీ ఎడ్ల మహేష్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని గ్రీన్ సిటీ మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 6లోగా 9885282233, 9959977929లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అండర్ 11 నుంచి 19 వరకు బాల బాలికలకు, మెన్, వుమెన్ మాస్టర్స్ 35 నుంచి 75 సంవత్సరాల వయస్సు గల వారికి ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు.

జిల్లాలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 1: జిల్లాలో శనివారం 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జన్నారంలో 45.1, కాసిపేటలో 44.5, దండేపల్లిలో 43.3, నస్పూర్‌లో 43.2, భీమినిలో 43.1, వేమనపల్లి, నెన్నెలలో 43.0, లక్సెట్టిపేటలో 42.6, మంచిర్యాలలో 42.5, కోటపల్లి, భీమారంలో 42.4, కన్నెపల్లిలో 42.3, బెల్లంపల్లిలో 42.2, తాండూర్‌లో 42.0, జైపూర్‌లో 41.7, మందమర్రిలో 41.6, హాజీపూర్‌లో 41.4, చెన్నూరు 40.5 డిగ్రీలు నమోదయ్యాయి.

వడదెబ్బతో యువకుడి మృతి

భీమారం, జూన్ 1: మండల కేంద్రంలోని వేపలబోడ సమీపంలో ఇరికిల్ల సంపత్ (40) శనివారం వడదెబ్బతో మృతిచెందాడు. శ్రీరాంపూర్ చెందిన సంపత్ చెన్నూరులోని వైన్స్‌షాపు సిట్టింగ్ పాయింట్‌లో పనిచేస్తున్నాడు. మండల కేంద్రంలోని స్నేహితుడు మధుసూదన్‌ను కలిసేందుకు భీమారం వచ్చాడు. అనంతరం సంపత్ ఒక పంచర్ షాపు సమీపంలో పడుకున్నాడు. సాయంత్రం 4 గంటలైనా లేవకపోవడంతో షాప్ యజమాని మృతి చెందాడని గమనించి స్నేహితుడు మధుసూదన్‌కు సమాచారం అందించగా పోలీసులకు సమాచారం అందించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు. మృతుడి భార్య గతంలో మృతి చెందగా తల్లిదండ్రులు ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

కాసిపేట, జూన్ 1 : సోమగూడెం చెందిన గుజ్జుల రాజేందర్-రజిత దంపతుల కూతురు సిరికుందన ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. వాల్మీకి బోయ రాష్ట్ర అధ్యక్షుడు గొంది వెంకటరమణ విద్యార్థినికి శనివారం రూ. 10,116 నగదును అందించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన సిరికుందన మంచి మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థినికి సరస్వతి విగ్రహాన్ని అందజేశారు.

పాఠశాలల అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి



తీగల్‌పహాడ్ పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నస్పూర్, జూన్ 1: నస్పూర్ పట్టణం తీగల్‌పహాడ్, విలేజ్ నస్పూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం అదనపు కలెక్టర్ రాహుల్ సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న మరుగుదొడ్ల మరమ్మతు పనులు, గదుల విద్యుద్దీకరణ, మరమ్మతు పనులను పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభానికి ముందుగానే పనులు పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పాఠశాలల ఉపాధ్యాయులు సైతం పనులు త్వరగా అయ్యే విధంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సంధ్య, తీగల్‌పహాడ్, విలేజ్ నస్పూర్ జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కుడికాల రామన్న, దామోదర్ తదితరులు ఉన్నారు.

అటవీ భూమి కబ్జాకు యత్నం



విచారణ చేపడుతున్న అటవీ శాఖ అధికారి

జైపూర్, జూన్ 1 : మండల కేంద్రంలో అటవీ శాఖకు చెందిన భూమిని శనివారం అధికార పార్టీకి చెందిన నాయకులు కబ్జా చేసేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న అటవీ రేంజ్ అధికారి సాగరిక సిబ్బందితో వచ్చి అడ్డుకున్నారు. బస్టాండ్ సమీపంలో ఉన్న అటవీ కార్యాలయం భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొంత స్థలం ఆక్రమణకు గురికాగా కొందరు కోర్టులో కేసు వేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గద్దె నిర్మించే ఏర్పాట్లు చేసేందుకు కాంగ్రెస్ నాయకులు యత్నించగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. సుమారు 50 ఏండ్ల క్రితం ఇక్కడ అటవీ రేంజ్ కార్యాలయం ఉండగా కాలక్రమేణా కూలిపోగా స్థలంపై పలువురు కన్నేశారు.

కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మందమర్రిటౌన్, జూన్ 1: పట్టణం లో శనివారం రాత్రి బీఆర్‌ఎస్ దాని అను బంధ సంఘాల నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి కోల్‌బెల్ట్ రోడ్డు మీదుగా అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ కొనసాగింది. తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు పెట్టి నివాళులర్పించారు. నాయకులు జె.రవీందర్, ఓ.రాజశేఖర్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతో మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహించామన్నారు. ఆదివారం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేటీఆర్, బాల్క సుమన్ పిలుపు మేరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తిరుపతిరెడ్డి, సంపత్, బండారి సూరిబాబు, రవీందర్, అబ్బాస్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



దండేపల్లిలో పూజలు

చెన్నూరు, జూన్ 1: చెన్నూరు పట్టణం, మండలంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పంచముఖి హనుమాన్, ప్రతాపమారుతి, చోట, బడా హనుమాన్ ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని పూజలు చేశారు. ఓత్కులపల్లి, ఆస్నాద, కిష్టంపేట గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

నస్పూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో హనుమాన్ జయంతి పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నస్పూర్ కాలనీ, గోదావరి కాలనీ, సీసీసీ, సంఘమల్లయ్య పల్లె, విలేజ్ నస్పూర్, కట్టకొమ్ము గుడిసెలు, శ్రీరాంపూర్ కాలనీ, క్రిష్ణా కాలనీల్లోని ఆలయాల్లో స్వామి వారికి చందనాభిషేకం, చాలీసా పారాయణం, ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా రామ నామస్మరణతో మారుమోగింది. పలువురు స్వాములు దీక్ష విరమణకు కొండగట్టుకు వెళ్ళి మాల విరమణ చేశారు.

దండేపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతి పురస్కరించుకొని భక్తులు, హనుమాన్ దీక్షాపరులు ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామికి చందనాభిషేక పూజలు, దీక్షాపరులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చదివారు. అంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ చేపట్టి రామనామ స్మరణతో పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఏసీసీ: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఐబీ చౌరస్తాలో ప్రజలకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. వీర హనుమాన్ సేన సభ్యులు ప్రవీణ్, ఈశ్వర్, వంశీ పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఏరియాలోని హనుమాన్ ఆలయంలో ఆలయ చైర్మన్ చెరుకు సరోత్తమ్‌రెడ్డి, భారతి ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు పూజారులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోతనపల్లిలో ఉప్పమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు.

తాండూర్: బోయపల్లి హనుమాన్ దేవాలయంలో జయంతి ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కిష్టంపేట బస్టాండ్ సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహించారు.

కన్నెపల్లి: వీరాపూర్, జన్కాపూర్, కన్నెపల్లి, రెబ్బెన, జజ్జరవెల్లి, మాడవెల్లి గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ జయంతిని నిర్వహించారు. భక్తులు ఉదయమే ఆలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భజన

అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు

- ఎఫ్ఆర్వో పూర్ణచందర్‌రావు

సిర్పూర్(టి), జూన్ 1: రిజర్వు ఫారెస్టు భూమి ఆక్రమించినా, వన్యప్రాణులను హతమార్చినా ఎంతటి వారిపైనా చర్యలు తప్పవని ఎఫ్ఆర్వో పూర్ణచందర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ఇటిక్యాల పహాడ్ గ్రామంలో పోడు రైతులు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ ఏడాది 200 హెక్టార్లలో రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మొక్కలు నాటామని చెప్పారు. రిజర్వు ఫారెస్టు భూమి ఆక్రమించినా, వన్యప్రాణులను హతమార్చినా ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా వారిపై అటవీహక్కు చట్టం ప్రకారం చర్య లు ఉంటాయన్నారు. మొక్కలు నాటే కార్యక్రమానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి పాషా, ఎఫ్ఎస్‌వో మోహన్, ఎఫ్‌బీవో లు, ఎఫ్ఎస్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే..
తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

» గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్

» గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

» బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వులుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

» నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుతాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?

» 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక

» రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్ట్ కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహిదొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసుకొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..

2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా... అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు... భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

మమ్మల్నెందుకు పిలవలేదు!

» సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న

» ట్యాంపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహ ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ ప్రాత ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎస్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

భారీగా నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 5 క్వింటాళ్ల లూజు విత్తనాలు స్వాధీనం - ముగ్గురిపై కేసు నమోదు

నెన్నెల, జూన్ 1: బొప్పారంలో భారీగా నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. 5 క్వింటాళ్ల లూజు విత్తనాలను శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. రామగుండంలో విలేకరుల సమావేశంలో సీపీ శ్రీనివాసులు వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఎస్సై లచ్చన్నల ఆధ్వర్యంలో స్పెషల్ టీం బొప్పారం గ్రామానికి చెందిన కర్ణకొండ చంద్రశేఖర్ ఇంట్లో సోదాలు చేశారు. బియ్యం బస్తాల్లో దాచి ఉంచిన రూ.15 లక్షల విలువగల 5 క్వింటాళ్ల లూజు విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. భైంసాకు చెందిన రజాక్, మందమర్రికి చెందిన జాని అనే వ్యాపారుల వద్ద కొనుగోలు చేశానని, సొల్లు పెద్దయ్య అలియాస్ సురేష్ తన వద్దకు విత్తనాలు తీసుకువచ్చాడని చంద్రశేఖర్ చెప్పాడు. 5 క్వింటాళ్ల విత్తనాల్లో బెల్లంపల్లి మండలం చాకెపల్లికి చెందిన సూరం దిలీప్, కాసిపేటకు చెందిన కల్లూరి వెంకటేశంలు భాగస్వాములుగా ఉన్నారని గుర్తించామని సీపీ వివరించారు. మాయ మాటలతో రైతులను నమ్మించి వారికి నకిలీ విత్తనాలు అంటగడితే సహించేది లేదని సీపీ హెచ్చరించారు. అలాంటి వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రామగుండం పోలీస్ కమిషనర్

బదిలీలు పదోన్నతులు వెంటనే చేపట్టాలి

జన్నారం, జూన్ 1: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వేసవి సెలవులు ముగిసేలోగా చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9 సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు, 7 ఏండ్లుగా బదిలీలు లేక పోవడంతో నష్టపోతున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

గుడుంబా తయారీ కేంద్రంపై దాడి

నెన్నెల, జూన్ 1: ఆవడం గ్రామ శివారులోని గుడుంబా తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. పాతిపెట్టిన బెల్లం పానకం డ్రమ్ములను వెలికి తీసి బట్టీలను ధ్వంసం చేశారు. వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. ముప్పిడి శ్రీనివాస్‌ను విచారించగా బొలిశెట్టి జనార్దన్, తార బట్టీ నిర్వహిస్తారని పేర్కొన్నాడు. శ్రీనివాస్‌ను అరెస్టు చేశామని, జనార్దన్, తార పరారీలో ఉన్నారని తెలిపారు.

మావోయిస్టు అగ్రనేత కటకం సుదర్శన్ వర్ధంతి

బెల్లంపల్లి, జూన్ 1:మావోయిస్టు అగ్రనేత కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ వర్ధంతిని శనివారం పద్మశాలి భవన్‌లో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు సంఘాల సభ్యులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ మావోయిస్టు అగ్ర నేత కటకం సుదర్శన్ గతేడాది గుండెపోటుతో మృతి చెందారన్నారు. సుదర్శన్ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. పద్మకుమారి, కుమారస్వామి, రాజన్న, పాణి, అల్లం రాజయ్య, శ్రీనివాస్, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్, సూరిబాబు, నాతరి స్వామి, కటకం సతీష్ పాల్గొన్నారు.



సుదర్శన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘాల నాయకులు

చంద్రబాబును కలిసిన టీడీపీ నేత సంజయ్

మందమర్రి టౌన్ జూన్ 1: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును పెద్దపల్లి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి విజయం సాధిస్తుందని ఆయన తెలిపారు.

భర్త చేతిలో భార్య హతం

కాసిపేట, జూన్ 1 : కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మామిడిగూడెంలో భర్త చేతిలో భార్య హత్యకు గురైంది. పోలీస్‌స్టేషన్‌లో శనివారం మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. మామిడిగూడెంకు చెందిన నగావత్ దేలు భార్య నగావత్ మారోణి(68) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నారు. శుక్రవారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. క్షణికావేశంలో పక్కనే ఉన్న గొడ్డలితో దేలు భార్య తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో దేలు అక్కడ నుంచి పారిపోయాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించామన్నారు. కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిందితున్ని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

హాజీపూర్, జూన్ 1: గుడిపేట గ్రామానికి చెందిన ఎంబడి వెంకటేష్ (35) భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుడిపేట గ్రామానికి చెందిన వెంకటేష్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. భార్యతో గొడవ పడడంతో పుట్టింటికి వెళ్లింది. దీంతో ఉద్యోగం మానేసి మద్యానికి బానిసయ్యాడు. భార్య రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ప్రమాదవశాత్తు వరి గడ్డి దగ్ధం

చెన్నూరు, జూన్ 1: దుగ్నేపల్లి గ్రామంలో శనివారం మొగిలి రమేష్ అనే రైతుకు చెందిన వరిగడ్డి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఇంటి పక్కనే ఉన్న వరిగడ్డి వాములో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో చుట్టు పక్కల వారు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు ఆరకపోవడంతో చెన్నూరులోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. రూ.30 వేల వరకు నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

విత్తనాలు విడిగా విక్రయించొద్దు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 1: విత్తన డీలర్లు విత్తనాలను విడిగా విక్రయించకూడదని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామంలోని అను బ్రదర్స్ సీడ్స్ ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. విత్తన, ఎరువుల గోదాంను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ఏవో ఖాదర్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు.

వాంకిడి: రైతులకు సరిపడ విత్తనాలు అందించాలని ఏఓ మిలింద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు.

పెంచికలపేట: మండలంలోని ఎల్లూరు, ఎల్కపల్లి గ్రామాల్లో శనివారం ఎరువుల దుకాణాలను, గోదాంలను తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఏవో రాజుల నాయుడు శనివారం తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఎస్సై ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి): ఎరువుల దుకాణందారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్టు అమలు చేస్తామని ప్రత్యేక బృందం అధికారులు అన్నారు. ఎస్సై రమేశ్, ఏవో మధులత, ఎంఆర్ఐ ముబీన్ విత్తన దుకాణాలను తనిఖీ చేశారు.

చింతలమానేపల్లి: ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో రామకృష్ణ, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. ఆయన వెంట సోంజీ, రావూజీ, ఏఈఓ శ్రీనివాస్ ఉన్నారు.

కౌటాల: ముత్తంపేట గ్రామంలోని విత్తన గోదాంలను రెవెన్యూ, వ్యవసాయ, పోలీసు అధికారుల సహకారంతో టాస్క్‌పోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన రిజిస్టర్‌లు, స్టాక్‌లను పరిశీలించారు.

పంచాయతీ కార్మికుల సంక్షేమమే ధ్యేయం

ఆసిఫాబాద్, జూన్ 1: పంచాయతీ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు తెలిపారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉదయం మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న కార్మికులకు ఓఆర్ఎస్, గ్లూకోజ్ అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

తిర్యాణి, జూన్ 1: తిర్యాణి మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం పీఏసీఎస్ ఛైర్మన్ చుంచు శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలిసి వడ్లలోని తేమశాతాన్ని పరిశీలించారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

లింగాపూర్, జూన్ 1: పాఠశాలల్లో చేపడుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మండలంలోని జడ్పీ పాఠశాలలో చేపడుతున్న పనులను శనివారం పరిశీలించారు కార్యక్రమంలో డీఈవో అశోక్, మండల విద్యాధికారి సుధాకర్, తదితకులు పాల్గొనారు.

సిర్పూర్(యు): అమ్మ ఆదర్శ పాఠశాల పనులు సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. జిల్లా పరిషత్ పాఠశాల, కేజీబీవీ పాఠశాల, ఆదర్శ పాఠశాల, ఐకేపీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, ఎంపీడీవో ప్రవీణ్, ఎంఈవో కుడ్మేత సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల సందర్శన

సిర్పూర్(యు), జూన్ 1: మండలంలోని ప్రెసిడెంట్‌గూడ, ఖాతీగూడ, దేవుగూడ, తూమ్రిగూడ, మహగాం, పటేల్‌గూడ, కరోబారిగూడ, కోడ్డిగూడ, అలీగూడ తదితర గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలను జైనూర్ ఏటీడీవో పురుషోత్తం శనివారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు పరిశీలించి సూచనలు చేశారు.

పది వేల క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు

జైనూర్, జున్ 1: మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ గోదాంలో మార్క్‌ఫెడ్, సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పరంగా ఈ ఏడాది పది వేల 2 వందల క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేశామని సహకార సంఘం ఛైర్మన్ కొడప హన్నుపటేల్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

రాష్ట్ర అవతరణ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ఆసిఫాబాద్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఆదివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో నిర్వహించే వేడుకల్లో కలెక్టర్ వెంకటేష్ దోత్రే పాల్గొనున్నారు.

కొనసాగుతున్న ఉపాధిహామీ ప్రజావేదిక

కెరమెరి, జూన్ 1: ఉపాధిహామీ ప్రజావేదిక శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు జరిగిన మొత్తం 492 పనులగాకు గాను మెటీరియల్ పేమెంట్ రూ.47,61,454, వేజ్ పేమెంట్ రూ.7,39,06,592 కు గాను ఆడిట్ చేపట్టారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, డీవీవో కృష్ణమూర్తి, అధికారిని సాయిశ్రీ, క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేశ్, ఎస్ఆర్పీ మహేందర్, వేణు, ఎంపీడీవో అంజద్‌పాషా, ఏపీవో మల్లయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ

దండేపల్లి,జూన్ 1: గ్రామపంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని నంబాల గ్రామస్థులు తహసీల్దార్ సంధ్యరాణికి ఫిర్యాదు చేశారు. శనివారం నంబాల పంచాయతీ ఆవరణలోని ఖాళీ స్థలాన్ని పంచాయతీ భవనం పక్కన నివాసం ఉంటున్న వ్యక్తి ఆక్రమించుకొని ప్రహరీ నిర్మిస్తున్నారని, భూమి కబ్జా కాకుండా చూడాలని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గతంలో మండల సర్వేయర్, అధికా రులు హద్దులు ఏర్పాటు చేశారు. దాని ఆధారంగా గ్రామ పంచాయతీ నుంచి కబ్జా చేసిన వ్యక్తికి నోటీసులు అందించారు. నోటీసును పట్టిం చుకోకుండా ప్రభుత్వ భూమిలో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నాడు. అత నిపై చర్యలు తీసుకోని ప్రభుత్వ భూమిని కాపాడాలని తహసీల్దార్‌ను కోరారు. గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

విద్యుత్ తీగలు తాకి యువకుడి మృతి

మహదేవపూర్, జూన్ 1: వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు తాకి యువకుడు మృతి చెందిన సంఘటన మద్దులపల్లి అటవీ ప్రాంతంలో శనివారం చోటుచేసుకుంది. కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ తెలిపిన వివరాల ప్రకారం... మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొల్లూరు బోరంపెల్లికి చెందిన మతి స్థిమితం సరిగా లేని దుర్గం ప్రవీణ్ (29) అమ్మమ్మ ఇంటికి మద్దులపల్లికి వచ్చాడు. శనివారం తిరిగి బయల్దేరిన అతడు అక్కడికి చేరుకోలేదు. దీంతో సోదరుడు ప్రదీప్ వెతకగా అటవీ ప్రాంతంలో ప్రవీణ్ మృతదేహం కనిపించింది. వేటగాళ్లు అమర్చిన విద్యుత్ వైర్లు తాకడం వల్ల షాక్ తగిలి మృతి చెందినట్లు గుర్తించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంపోస్టు ఎరువుల తయారీ నిరంతర ప్రక్రియ

కాసిపేట, జూన్ 1: కంపోస్టు ఎరువుల తయారీ నిరంతరం కొనసాగించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం కాసిపేట, ముత్యంపల్లి, దేవాపూర్ గ్రామాల్లో పర్యటించారు. సెగ్రిగేషన్ షెడ్‌లను, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించి కంపోస్టు ఎరువు తయారు చేయాలన్నారు. కంపోస్టుపిట్‌లో వానపాములు బతికి ఉండేలా చూడాలన్నారు. ఎరువులను నర్సరీలకు, ప్రకృతి వనాలకు ఉపయోగించాలన్నారు. నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని, హరితహారానికి సిద్ధం చేయాలన్నారు. క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలన్నారు. ఎంపీవో నాగరాజు, కార్యదర్శులు మేఘన, సౌందర్య పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

మందమర్రిటౌన్/రూరల్ జూన్ 1: పట్టణ, మండలంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయాధికారి రాజేశం తనిఖీలు చేశారు. రిజిష్టర్‌లను, స్టాకు నిల్వలను, విత్తనాల ప్యాకెట్లను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్ఐ రాజశేఖర్, ఏఈవో ముత్యం తిరుపతి, ఏఎస్ఐ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి

మందమర్రిరూరల్, జూన్ 1: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 3నుంచి ప్రతి గ్రామంలో బడి బయట, బడి మానేసిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పాఠశాలల్లోని వసతులను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఎంఈవో జాడి పోచయ్య, ఎస్ఐ రాజశేఖర్, ఎంపీవో బీరయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: కిష్టంపేట, తాండూర్ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఎంపీడీవో శ్రీనివాస్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఐకేపీ సిబ్బందితో బడిబాటపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ ఈ నెల 3 నుంచి 19 వరకు బడిబాట ఉంటుందన్నారు. 5, 6 సంవత్సరాల వయస్సు పిల్లల వివరాలు సేకరించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మండల నోడల్ అధికారి మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూపరాణి, పాల్గొన్నారు.

బదిలీలకు రంగం సిద్ధం



- ఎన్నికల కోడ్ ముగియగానే భారీగా బదిలీలు
- మండల స్థాయి అధికారుల నుంచి ఉన్నతాధికారుల వరకు
- ప్రభుత్వ ప్రకటనతో సిబ్బందిలో ఆందోళన
- నచ్చిన చోట పోస్టింగ్ కోసం ముమ్మర ప్రయత్నాలు

బెజ్జూరు, జూన్ 1: ఎన్నికల కోడ్ ముగియగానే జిల్లాలో భారీ స్థాయి లో ఉద్యోగుల బదిలీలు చేపట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారుల బదిలీలు జరిగినా జిల్లా, మండల స్థాయిలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కొన్ని శాఖల అధికారులు బదిలీలు జరిగాయి. గత జూలై నుంచి ప్రారంభమైన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ఈనెల మొదటి వారంతో ముగియనుంది. 4వ తేదీన ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటించనున్నారు.

లోక్‌సభ ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు ముగియనుంది. తరువాత రాష్ట్రంలో ప్రభుత్వం బదిలీలపై దృష్టి సారించనుంది. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నతాధికారులకు ఎవరికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనే విషయమై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కొన్ని శాఖల అధికారులు ఎన్నికలకు ముందు జిల్లా నుంచి బదిలీ ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. కొత్త జిల్లాలు ఏర్పాటయిన పృడు జిల్లాకు వచ్చిన వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు ఇంకా జిల్లాలోనే కొనసాగుతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికా రుల బదిలీల తరువాత వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు బదిలీలు జరగనున్నట్లు తెలిసింది. ఆ తరువాత డివిజన్, మండల స్థాయి అధికారుల బదిలీలు జరగనున్నట్లు సమాచారం.

స్వస్థలాలకు వచ్చేందుకు..

కాగా ఎన్నికల బదిలీల్లో సొంత జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులు కూడా తిరిగి జిల్లాకు వచ్చేందుకు అవకాశాలను అన్వేషిస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వ హించిన వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారుల్లో కొందరు ఎన్నికల బదిలీల్లో భాగంగానే వచ్చిన వారు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బాగంగా జిల్లా నుంచి బదిలీ అయిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. కుటుంబాలకు దూరంగా వచ్చిన తమను తిరిగి సొంత స్థానాలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పోలీస్, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్, ఫారెస్టు, పంచాయతీరాజ్, మెడికల్ అండ్ హెల్త్, ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్ తదితర శాఖల్లో పని చేస్తున్న అధికారులు తమకు అనుకూలంగా ఉండే పోస్టింగ్‌ల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే బదిలీలు చేపట్టనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

ఉన్నచోటనే కొందరు..

కలెక్టరేట్, డివిజన్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వారు కీలక మండలాల్లో పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మండలాల్లో పని చేస్తున్న తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తమకు లూప్‌లైన్‌లో పోస్టింగ్ ఇవ్వకుండా ఉన్నచోటనే కొనసాగే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారమవు తోంది. రాజకీయ పలుకు బడి, అండదండలు ఉన్న వారు ఆ దిశగా ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. జోన్, మల్టీజోన్ పరిధిలో పని చేస్తున్న అధికారులు కూడా తమకు అనుకూలంగా ఉండే పోస్టింగ్ కోసం తమ ప్రయత్నాలు తీవ్రతరం చేస్తున్నారు.

పనితీరుకు ప్రధాన్యమా?

బదిలీల్లో పనితీరుకు ప్రాదాన్యం ఇస్తారా? లేక గత ప్రభుత్వం మాదిరిగా సిఫారసులకే పెద్ద పీట వేస్తారా? అనేది అధికార వర్గాల్లో చర్చనీ యాంశంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లా అధికారి నుంచి ఎస్సై స్థాయి అధికారి వరకు ఎమ్మెల్యే సిఫారసులే చెల్లుబాటయ్యేవి. ఎమ్మెల్యే ఎవరికి సిఫారసు చేస్తే వారికే పోస్టింగ్ ఇచ్చేవారు. తమకు అనుకూలంగా పనిచేయడం లేదని బావిస్తే వెంటనే ఆ అధికారి స్థానం లో కొత్త అధికారికి పోస్టింగ్ ఇచ్చేవారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హ యాంలో కొనసాగినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా పోస్టింగుల్లో సిఫారసులకే పెద్దపీట వేస్తారా? లేక పనితీరుకు ప్రధానం ఇస్తారా అనే విషయమై జోరుగా చర్చ జరుగుతోంది.

పనులను వేగవంతం చేయాలి


చిర్రకుంటలో పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూన్ 1: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లాలో చిర్రకుంటలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రధానమైన అన్ని పనులు పూర్తవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కిటికీలు, వెంటిలేటర్లు, టాయిలెట్లకు సంబంధించిన చిన్న చిన్న మరమ్మతుల పనులు మిగిలి ఉండడం గమనించి అవి కూడా సత్వరమే పూర్తయ్యేటట్లు చూడాలని తెలిపారు. పాఠశాలకు అవస రమయ్యే డ్యూయల్ డెస్క్, గ్రీన్ చాక్‌బోర్డుల కోసం తగు చర్యలు తీసుకోవల్సిందిగా జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి భరత్‌కుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌దే శ్ పాండే, ఎంఈవో మనుకుమార్ ఉన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

సిర్పూర్(టి), జూన్ 1: కాగజ్‌నగర్ డివిజన్‌లోని పోలీసు అధికారులు ఈ నెల 8న నిర్వహిం చే నేషనల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తి అజయ్ అన్నారు. శనివారం కోర్టులోని హాల్‌లో కాగజ్‌నగర్ డివిజన్‌లోని అన్ని పోలీసు స్టేషన్ల ఎస్సైలు, డీఎస్పీతో సమావేశం నిర్వహించారు. ఆయా పోలీసు స్టేషన్‌ల పరిధిలో రాజీమార్గంలో పరిష్కరిం చేందుకు వీలు ఉన్న అత్యధిక కేసులను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, సీఐ సాధిక్‌పాషా, ఎస్సైలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

కాగజ్‌నగర్, జూన్ 1: మండలంలోని అనుకోడ అటవీ ప్రాంతంలో కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందినట్టు ఎఫ్ఆర్వో రమాదేవి తెలిపారు. అటవీ ప్రాంతంలోని కుక్కలు తరిమి దాడి చేసి చంపేసినట్టు వివరించారు.

చంద్రబాబును కలిసిన నాయకులు

కాగజ్‌నగర్, జూన్ 1: హైదరాబాద్‌లో శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్లమెంటు కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా సమస్యలు అధినేత దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన తెలిపారు.

సమస్యలు ఉంటే సంప్రదించాలి

ఆసిఫాబాద్, జూన్ 1: జిల్లాలోని మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. మహిళల రక్షణ కోసం షీ టీం, యాంటి ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పని చేస్తున్నాయని తెలిపారు. అత్యవసర సమ యాల్లో 8712670564 నంబరుకు, డయల్ 100కు సమా చారం అందించాలని తెలిపారు. కాగాలోక్‌సభ ఎన్నికలలో భాగంగా ఈ నెల 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు కార్యక్రమం అనంతరం ఎలాంటి విజయో త్సవ ర్యాలీలకు అనుమతి లేదని ఎస్పీ తెలిపారు.

అధికారులను అడ్డుకున్న పోడు రైతులు

కాగజ్‌నగర్, జూన్ 1: అంకుసాపూర్‌లో పోడు భూముల సర్వే చేసేందుకు వెళ్లిన అటవీ శాఖ అధికారులను శనివారం పోడు రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో రమాదేవి మాట్లాడుతూ పోడు భూములకు సంబంధించిన పట్టాల విషయంలో సర్వేలు చేస్తున్నామన్నారు. ఈ విషయంలో పోడు రైతులు సహకరించాలని కోరారు. అయితే పలువురు పోడు రైతులు మాట్లాడుతూ తమ వద్ద పట్టాలున్నట్టు తెలిపారు. రెవెన్యూ అధికారులు సర్వేలు చేసి ఇచ్చినట్టు వివరించారు. పూర్తి రికార్డులు పరిశీలించిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్వో తెలిపారు.

ఘనంగా హనుమాన్ జయంతి


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 1: జిల్లాలోని పలు ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆసిఫాబాద్ మండలంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు శిరీష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వ హించారు. జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నాయకులు అజ్మీరా శ్యాంనాయక్, ఎంపీప మల్లికార్జున్‌లు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వివేక్, రమేష్, వెంకన్న, శ్రీనివాస్, సుధాకర్, నారాయణమూర్తి, యాదగిరి, రాధాకృష్ణచారి, మధు, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: పట్టణంలో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా జరిగాయి. పట్టణంలోని హనుమాన్ ఆలయాల్లో ఉదయం నుంచి భక్తులు పూజలు నిర్వహించారు. జయంతిని పురస్కరించుకొని సింధూర పూజ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తులకు పూజారులు అందజేశారు.

పెంచికలపేట: మండలంలోని పలు గ్రామల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎల్కపల్లి, చెడ్వాయితదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకం నిర్వహించారు.

చింతలమానేపల్లి: మండలంలోని హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కర్జవెల్లి, గూడెం, చింతలమానేపల్లి, బాబాసాగర్ తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



అన్ని యూనియన్లను ఆహ్వానించాలి

మందమర్రి టౌన్, జూన్ 1: రాష్ట్ర అవతరణ వేడుకలకు అన్ని యూనియన్లను ఆహ్వానించాలని టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకులు ఒ రాజశేఖర్, జె రవిందర్, బడికెల సంపత్ అన్నారు. టీబీజీకేఎస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బెల్లం అశోక్, వీరారెడ్డి, రాంచందర్, తది తరులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: దశాబ్ది ఉత్సవాలకు సింగరేణి యాజమాన్యం అన్ని కార్మిక సంఘాలను ఆహ్వానించాలని సీఐటీయూ నాయకులు మంద నర్సింహరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఎన్నికలు జరిగినా ఇంత వరకు గెలిచిన సంఘానికి గుర్తింపు పత్రం ఇవ్వలేదని, అలాంటప్పుడు యాజమాన్యం ఏఐటీయూసీని, ఐఎన్టీయూసీని ఎందుకు పిలుస్తుందని ప్రశ్నించారు.

రక్షణ కమిటీ సమావేశం బహిష్కరణ

శ్రీరాంపూర్, జూన్ 1: శ్రీరాంపూర్ సీహెచ్‌పీ డీజీఎం డీవీ రావు వైఖరిని నిరసిస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రక్షణ కమిటీ సమావేశాన్ని బహిష్కరిం చారు. ఈ సందర్భంగా యూనియన్ ఉపాధ్యక్షుడు జె.శంకర్ రావు మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న కార్మికులను శ్రీరాంపూర్ సీహెచ్‌పీ డీజీఎం డీవీరావు వేధించడం సరికాదన్నారు. గత నెల 24న నిర్వహించిన సమావేశాన్ని సైతం బహిష్కరించామని, అయినా అతనిలో మార్పు రావడం లేదని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో పిట్ కార్యదర్శి లతీఫ్, బ్రాంచ్ నాయకులు తిరుపతిరెడ్డి, ఆర్. శ్రీనివాస్, గుండా సత్తయ్య, పిట్ నాయకులు, అన్ని షిఫ్టుల కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదరహిత ఏరియాగా నిలుపాలి


కార్మికులతో మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, జూన్ 1: శ్రీరాంపూర్ ఏరియాను ప్రమాద రహిత ఏరియాగా నిలపాలని జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. ఆర్‌కె 7 గనిపై "ఫాటల్ ఫ్రీ జూన్-2024"పై ప్రత్యేక భద్రత అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జూన్ మాసంలో ఏరియాలోని అన్ని గనుల్లో ఒక్క ప్రమాదం కూడా జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి ఇందుకు సహకరించాలని కోరారు. రక్షణ సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌కె-7 గ్రూప్ ఏజెంట్ రాముడు, మేనేజర్ ఎస్. శ్రీధర్, ఇన్‌చార్జి రక్షణాధికారి అమర్నాథ్ రెడ్డి, గని రక్షణాధికారి రవిశంకర్, పిట్ కార్యదర్శి బీర రవీందర్, సంక్షేమాధికారి సంతన్ పాల్గొన్నారు.

● రక్షణ సూత్రాలు పాటించాలి

కాసిపేట, జూన్ 1: ప్రతి ఒక్కరూ రక్షణ సూత్రాలు పాటించాలని కాసిపేట 1వ గని రక్షణాధికారి సునీల్ అన్నారు. కాసిపేట గనిపై కార్మికులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, డిప్యూటీ మేనేజర్ నిఖిల్, వెంకటేశ్వర్లు, గని ఇంజనీర్ మధుకర్, అండర్ మేనేజర్ సుమన్, వర్కుమెన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, మురళీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం మనోహర్

మంద మర్రి టౌన్, జూన్ 1: పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లను మందమర్రి జీఎం ఆయా డిపార్టుమెంట్ల అధికారులతో శనివారం పరిశీలించారు. స్టాల్స్ ఏర్పాటు చేస్తున్న తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని డిపార్టుమెంట్ల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. దశాబ్ది కాలంలో సింగరేణి సాధించిన ప్రగతి, సంక్షేమ కార్యక్రమాలను వివరించనున్నట్లు తెలిపారు. ముందుగా గనుల పై జెండాలను ఆవిష్కచి, జాతీయ గీతాలాపన అనంతరం సీఎండీ సందేశం వినిపించనున్నా మని తెలిపారు. అమరవీరులకు నివాళుల ర్పించడంతో పాటు తెలంగాణతల్లికి పూలమాల వేసి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించను న్నట్లు తెలిపారు. తెలంగాణ సాధనలో సింగ రేణి ఉద్యో గుల పాత్ర కీలకమన్నారు. రాష్ట్రం కోసం 30 రోజులు సమ్మె చేసిన ఘనత సింగరేణి ఉద్యోగుల దేనన్నారు. ఇతర సంస్థలకు ఆద ర్శంగా నిలిచే విధంగా అంకితభావం తో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ డిపార్టుమెంట్ల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అసంతృప్తి

- 35 రోజుల పాటు సకలజనుల సమ్మెలో పాల్గొన్న సింగరేణియులు

మందమర్రి టౌన్, జూన్ 1: ప్రత్యేక రాష్ట్రంలో పదేళ్లలో తమకు ప్రభుత్వం చేయూత నివ్వలేదని కార్మికులు అసంతృప్తితో ఉన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో సకలజనుల సమ్మెలో సింగరేణియులు పాల్గొన్నారు. పదేళ్ల క్రితం 35 రోజుల పాటు సమ్మె చేయడంతో సింగరేణి వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి స్తంభించిపోయింది. రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా సింగరేణీయులు తమ పోరాట పటిమతో ముందుకు సాగారు. దీంతో ఒక బొగ్గు పెల్ల కూడా బయటకు రాలేదు. బొగ్గు బావులన్ని బోసిపోయి నిర్మానుష్యంగా మారాయి. సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలు సంఘటితమై సకలజనులకు అండగా నిలిచారు. చాలా మంది నాయకులు అరెస్టులు కూడా అయ్యారు. కాగా 2009 సెప్టెంబరు 9న తెలంగాణ ఇస్తున్నామని ప్రకటించి మళ్లీ వెనక్కి తీసుకోవడం లాంటి పరిణామాల నేపథ్యంలో ఉద్యమాలు తీవ్రతరం చేశారు. అన్ని రకాల ఒత్తిళ్ల, ప్రజల ఆకాంక్షల నేప థ్యంలో కేంద్రం తెలంగాణ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రత్యేక రాష్ట్రంలో తమకు అన్ని రకాలుగా మేలు జరుగుతుందని భావించిన కార్మికుల ఆశలు అడియాశలయ్యాయి. రాష్ట్రాన్ని సాధించుకుంటే రాష్ట్ర అవతరణ రోజు వేతనంతో కూడిన సెలవు ఎందుకు ఇవ్వడం లేదని కార్మికులు, వారి కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్ర సాధనలో సింగరేణీయుల ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని సెలవు దినంగా ప్రకటించాలని కార్మికులు కోరుతున్నారు.

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

శ్రీరాంపూర్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేశారు. ఉత్తమ అధికారిగా ఆర్‌కె-7 గనిలో పనిచేస్తున్న కోజా వెంకటరాములు ఎన్నికయ్యారు. ఆయన కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో సన్మానం అందుకుంటారు. కాగా శ్రీరాంపూర్ ఏరియా ఉత్తమ ఉద్యోగిగా ఆర్‌కె 5 గనికి చెందిన జనరల్ మజ్దూర్ కార్మికుడు నీదిరాల మల్లారావు ఎంపికయ్యారు.

మందమర్రిటౌన్: మందమర్రి ఏరియా ఉత్తమ ఉద్యోగులను యాజమాన్యం ఎంపిక చేసింది. ఆర్కేపీ ఓసీపీలో పనిచేస్తున్న సీనియర్ సర్వే ఆఫీసర్ మన్నెపల్లి శేఖర్, కాసిపేట గనిలో పనిచేస్తున్న కోల్‌కట్టర్ సంతోష్‌లు ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. కొత్తగూడెంలో సిఎండీ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.